మారిన 58వ డివిజన్ రూపురేఖలు



షణ్ముక సాయి నగర్ నాడు - నేడు

- నాడు బురద కయ్యలు.. నేడు అద్దాల్లా మెరుస్తున్న రోడ్లు
- డివిజన్ పరిధిలో 8 సచివాలయాలు
- రూ. 26 కోట్లతో మౌలిక సదుపాయాలు

ఇది కదా.. అభివృద్ధి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఇందిరానాయక్ నగర్, తోటవారి వీధి, నందమూరి నగర్, భరతమాత కాలనీ, సన్‌సిటీ కాలనీలు కనీస వసతులకు నోచుకోలేదు. రోడ్లు బురద కయ్యాలుగా దర్శనమిచ్చాయి. కచ్చా రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వర్షాలకు జలమయమై నానా అవస్థలకు గురయ్యారు. ఈ ప్రాంతంలో వందల కొద్ది అపార్ట్‌మెంట్లు నిర్మాణం జరిగింది. కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చినప్పటికీ కార్పొరేషన్‌లో గత టీడీపీ పాలక మండలి ఆయా కాలనీల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. బురద రోడ్లు, పిచ్చికంపలు, పాములు, దోమలతో కాలనీ వాసులు దుర్భరమైన జీవనం గడిపారు.

మోడల్ డివిజన్‌గా రూపాంతరం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అజిత్‌సింగ్‌నగర్‌లోని 58వ డివిజన్ అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతోంది. నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ డివిజన్ మోడల్ డివిజన్‌గా రూపుదిద్దుకుంది. 56 నెలల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.26 కోట్లు ఖర్చు చేసి రోడ్లు, డ్రెయినేజీలు, యూజీడీ, వాటర్ పైపులైన్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించింది. ఇక నవరత్నాలు పథకాల ద్వారా డీబీటీ విధానంలో రూ.66.42 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేసింది. నాన్ డీబీటీ ద్వారా రూ.68.42 కోట్లు అందించింది. డివిజన్‌లో 85 శాతానికి పైగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణం పూర్తయ్యింది. యూజీడీ ఏర్పాటు చేశారు. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పడింది. తాగునీటి సరఫరాకు కిలో మీటర్ల మేర పైపులైన్లు ఏర్పాటు చేశారు. విద్యుదీకరణ, పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం ఆయా కాలనీలు హైదరాబాద్ కూకట్‌పల్లి, బంజారా హిల్స్ ప్రాంతాలను తలపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రభుత్వంలోనే పూర్తి అభివృద్ధి జరిగిందని పేర్కొంటున్నారు.

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం రూపాయల్లో
జగనన్న అమ్మ ఒడి	2,148	8,78,63,038
జగనన్న విద్యా దీవెన	1,401	6,04,61,577
జగనన్న వసతి దీవెన	1,077	1,69,84,211
జగనన్న విదేశీ విద్యా దీవెన	0	0
వైఎస్సార్ రైతు భరోసా	685	3,09,89,100
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	126	20, 52,422
వైఎస్సార్ సున్నావడ్డీ(పంట రుణాలు)	145	3,84,862
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	100	7,38,537
వైఎస్సార్ మత్స్యకార భరోసా	4	50,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	2,208	18,86,31,750
వైఎస్సార్ చేయూత	825	3,13,68,750
వైఎస్సార్ ఆసరా	2847	7,86,52,844
వైఎస్సార్ సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	3,455	1,35,62,337
వైఎస్సార్ కాపు నేస్తం	195	77,40,000
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	171	43,50,000
వైఎస్సార్ కళ్యాణమస్తు/ షాదీ తోఫా	1	50,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	751	3,39,94,635
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	493	37,17,200
హౌసింగ్	1,130	8,27,56,788
వైఎస్సార్ బీమా	39	59,35,000
వైఎస్సార్ వాహన మిత్ర	294	64,10,000
వైఎస్సార్ నేతన్న నేస్తం	1	72,000
జగనన్న చేదోడు	129	32,00,000
రేషన్ కార్డు కోవిడ్ సాయం	4,245	42,45,000
జగనన్న తోడు(వడ్డీ)	138	50,193
మొత్తం		66,42,60,964

నాన్ డీబీటీ

పథకం పేరు	లబ్ధిదారులు	మొత్తం రూపాయల్లో
ఇంటి స్థలాలు	1,411	34,71,06,000
జగనన్న విద్యా కానుక	380	27,53,840
బైజూస్ ట్యాబ్స్	99	941778
జగనన్న తోడు(రుణాలు)	324	60,32,556
జగనన్న గోరుముద్ద	405	37,12,335
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	46946994	20,82,95,693
కంటి వెలుగు	0	0
రేషన్ పంపిణీ	4,952	11,54,45,540
మొత్తం		68,42,87,742

గత ప్రభుత్వం విస్మరించింది..



25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నా. తోటవారి కాలనీ మొత్తం తుమ్మ చెట్లు, దోమలు, పాములు ఉండేవి. సరైన రోడ్లు లేవు. డ్రెయినేజీ లేవు. ఎన్నో ఇబ్బందులు పడ్డాం, గత ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిని విస్మరించింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత రూపు రేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రస్తుతం హైదరబాద్ కూకట్‌పల్లిని తలపిస్తోంది. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి చొరవతోనే అభివృద్ధి జరిగింది.

– తోట వెంకటేశ్వరావు, తోట వారి కాలనీ

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి



ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం, రెండు కళ్లుగా పాలన సాగిస్తోంది. ఇదే పంథాను కార్పొరేషన్‌లోనూ కొనసాగించాం. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి పెట్టాం. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచే నాటికి ఈ ప్రాంత పరిస్థితులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ప్రాధాన్యతా క్రమంలో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేశాం. ప్రస్తుతం డివిజన్ రూపురేఖలు మారిపోయాయి. రోడ్లు అద్దాల్లా మెరిసిపోతున్నాయి. అభివృద్ధిలో టీడీపీకి, వైఎస్సార్ సీపీకి పాలనలో తేడా చూపించాం.

– అవుతు శ్రీశైలజారెడ్డి, డెప్యూటీ మేయర్

మల్లాది సుందరమ్మ సేవలు చిరస్మరణీయం



సుందరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణు తదితరులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మల్లాది వేంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలిగా మల్లాది సుందరమ్మ అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాతృమూర్తి బాల త్రిపుర సుందరమ్మ ఆరాధనా ఉత్సవాలు మంగళవారం సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగాయి. ముందుగా జగద్గురు శంకరాచార్య పరంపర అద్వైత పీఠం ఆధ్వర్యంలో జ్ఞాన బోధనలు, ఆధ్యాత్మిక సంకీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మవేత్తలు, బంధువులు పాల్గొని సుందరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 2013లో ఆమె స్థాపించిన ట్రస్ట్ నేటికీ సేవలను కొనసాగించడం గొప్ప విషయమన్నారు. ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని వారు కీర్తించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బంధువులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు వెంటనే పూర్తి చేయాలి



అధికారులతో చర్చిస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీపతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్‌యూబీ పనులను నాణ్యతా ప్రమాణాలతో వెంటనే పూర్తి చేయాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ సూచించారు. స్థానిక మధురానగర్ ఆర్‌యూబీ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి నగర పాలకసంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్‌యూబీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారన్నారు. ఆర్‌యూబీ పనుల్లో భాగంగా సాయిబాబాకాలనీకు రాకపోకలు నిలిపివేయటం వల్ల ప్రజలు అవస్థలు పడుతున్నారని, రాకపోకలకు వీలు కల్పించాలని సూచించారు. యూజీడీ, వాటర్ పైపులైన్ పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్ష మేరకు అతి త్వరలోనే ఆర్‌యూబీ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే బాబు, ఎస్‌కే అక్బర్, పోలుకొండ శ్రీనివాసరావు, గోవిందు, నక్కా శ్రీను, ఘనీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి రోడ్డు పరిశీలన



రామకృష్ణాపురం దేవీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ జానారెడ్డి, నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి ప్రాంతాన్ని మంగళవారం ఎంపీ కేశినేని కార్యాలయం సిబ్బంది మోహన్‌రావు, ప్రసాద్‌లు స్థానిక కార్పొరేటర్ జానారెడ్డితో కలిసి పరిశీలించారు. ఇక్కడ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు వేయటానికి రైల్వే అధికారులు అంగీకరించటం లేదు. ఈ విషయమై నగరపాలకసంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూడా రైల్వే అధికారులతో పలు మార్లు చర్చించారు. అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు ధ్వంసం కావడంతో పాటు రైల్వే స్థలం మీదుగా వెళ్తున్న యూజీడీ పైపులైన్లను శుభ్రం చేయటానికి సైతం ఇబ్బందికరంగా మారింది. స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ జానారెడ్డి సమస్యను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వెలంపల్లి ఎంపీ కేశినేని నానికి సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ కేశినేని నాని మంగళవారం దేవీనగర్‌లోని రైల్వే అండర్ బ్రిడ్జి తదితర అంశాలను పరిశీలించేందుకు తమ సిబ్బందిని పంపించారు. కార్పొరేటర్ జానారెడ్డి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న సమస్యలను స్థానికులతో కలిసి ఎంపీ కార్యాలయం సిబ్బందికి వివరించారు. దీనిపై వారు రామకృష్ణాపురం దేవీనగర్ రైల్వే లైన్ కింద రోడ్డు, రైల్వే స్థలంలో నుంచి వెళ్తున్న వంటి యూజీడీ సంబంధించించిన విషయాలను పరిశీలించారు. ఈ అంశాలను ఎంపీ కేశినేని నాని డీఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారని తెలిపారు.

గడప వద్దకే ప్రభుత్వ పథకాలు

- వారం రోజుల్లో ఆర్‌యూబీ ప్రారంభిస్తాం
- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



29వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా గడప వద్దకే ప్రభుత్వ పథకాలు అందించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్‌లో మంగళవారం జగనన్న రావాలి శ్రీనన్న కావాలి కార్యక్రమం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించటంతో పాటు స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మధురానగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసింది కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనని ఇక్కడ ఓటు అడిగే అర్హత టీడీపీ నేతలకు లేదన్నారు. ఐదు డివిజన్ వాసుల కోసం రూ.17 కోట్లతో నిర్మిస్తున్న ఆర్‌యూబీను వారం రోజుల్లో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వెలంపల్లి తెలిపారు. రూ.50 లక్షలతో కర్మల భవనం నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. తాము కష్టపడి తీసుకువచ్చిన మధురానగర్‌లో పోస్టాఫీస్ గత ప్రభుత్వం హయాంలో వేరే ప్రాంతానికి తరలిపోయిందని, మధురానగర్‌లో రైల్వేరిజర్వేషన్ కౌంటర్ తీసేసినా అధికారంలో ఉన్న టీడీపీ నేతలు పట్టించుకోలేదని చెప్పారు. అందిన కాడికి దండుకోవటమే ధ్యేయంగా బోండా ఉమా పనిచేశాడని మధురానగర్‌ను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకుగానూ ప్రత్యేక డీపీఆర్ తయారు చేస్తున్నామని కాలువలు ప్రక్షాళన చేస్తున్నామన్నారు.

చంద్రబాబువి హత్యా రాజకీయాలు

హత్య రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు అని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగాని హత్య చేయించింది టీడీపీ ప్రభుత్వం అని గుర్తుచేశారు. ఏనాడైనా చంద్రబాబు ఒంటరిగా పోటీ చేసి గెలిచాడా అని ప్రశ్నించారు. నీచ రాజకీయాలు చేసేది చంద్రబాబు అని అన్నారు. ఎంత మంది గుంపుగా వచ్చిన గెలిచేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కే బాబు, కంభం కొండలరావు, పోలుకొండ శ్రీనివాసరావు, గోవిందు, కోలా రమేష్, ఎస్‌కే అక్బర్, సుధాకర్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అమర గాయకుల సేవలు మధురం



గాయకుల సేవలు వివరిస్తున్న విజయలక్ష్మి, ఆనంద్ తదితరులు

విజయవాడకల్చరల్: అమర గాయకుల గాన సేవలు మధురాతి మధురమని మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య – సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం బహుభాషా గాయకులు మాధవ పెద్ది సత్యం, పిఠాపురం నాగేశ్వరరావు స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు. తెలుగు చిత్ర సీమలో తన గాన మాధుర్యం ద్వారా లక్షలాది ప్రజలను ఆకట్టుకున్న గాయకులు వారన్నారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ పిఠాపురం, మాధవపెద్ది జంట గాయకులని వారు హాస్యగీతాలతో పాటు పలు భక్తి గీతాలను కూడా ఆలపించారని తెలిపారు. ఉమాబలరాం, విష్ణుప్రియ, వడ్డాది సూర్యకామేశ్వరి, హరికృష్ణ, పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలతోపాటు హాస్యగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సీనియర్ గాయకుడు డేవిడ్‌రాజు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, బీవీ వీరభద్రరావు, కొప్పుల ఆనంద్ పాల్గొన్నారు.

వాంబేకాలనీలో పోలీసు కవాతు

పాయకాపురం(విజయవాడరూరల్): త్వరలో జరిగే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని అదనపు డెప్యూటీ పోలీసు కమిషనర్(టాస్క్‌ఫోర్స్) ఆర్.శ్రీహరిబాబు కోరారు. డీజీపీ ఆదేశాల మేరకు మంగళవారం వాంబేకాలనీలో పోలీసు అధికారులు నార్త్ జోన్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ డీఎస్‌పీ ప్రసాద్, సీఐలు ఎన్ దుర్గాప్రసాద్, జె.లక్ష్మీనారాయణ, జి.గురుప్రకాష్, టాస్క్‌ఫోర్స్ సీఐలు సీహెచ్ నాగశ్రీనివాస్, ఎస్.రమేష్‌కుమార్, సీఐఎస్ఎఫ్ ఆర్‌ఐ యాహిమ సిబ్బందితో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఏడీసీపీ ఆర్.శ్రీహరిబాబు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో కేంద్ర పారామిలటరీ బలగాలు, విజయవాడ పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఘనంగా భారతీ తీర్థ మహాస్వామి జన్మదిన వేడుకలు

విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 74వ జన్మదినం సందర్భంగా దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న వైదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం మహాశివలింగం, పార్వతీ పరమేశ్వ రుల విగ్రహాలకు వేదపండితులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ చక్రనవావరణ అర్చన, ఆదిదంపతులకు త్రిశతి, సహస్ర నామార్చన, మహామంగళ హారతి, నిర్వహించారు. ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ గురువారం శివాలయం ప్రాంగణంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ట జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. గండూరి చంద్రమౌళి, పూర్వపు ధర్మాధికారి జొన్నవిత్తుల ప్రభాకర శాస్త్రి పాల్గొన్నారు.

జిల్లాలో 98.82 శాతం పెన్షన్ పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వైఎస్సార్ పెన్షన్‌కానుక 98.82 శాతం పంపిణీ జరిగింది. జిల్లాలో మొత్తం 2,38,157 మంది పెన్షనర్లకుగాను 2,35,342 మంది పెన్షన్ అందుకున్నారు. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 99.56 శాతం, జగ్గయ్యపేట అర్బన్‌లో 99.5 శాతం, జగ్గయ్యపేట మండలంలో 99.47 శాతం, వీరులపాడులో 99.37శాతం, తిరువూరు(అర్బన్)లో 99.37 శాతం పంపిణీ చేశారు.

క్లుప్తంగా

200 మందికి ఇంటి పట్టాల పంపిణీ



మధురానగర్(విజవాడసెంట్రల్): అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు పూర్తి హక్కులతో ఇంటి పట్టాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని నగరపాలకసంస్థ కో ఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి అన్నారు. స్థానిక 32వ డివిజన్ 232వ వార్డు సచివాలయం పరిధిలో 200 మందికి మంగళవారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి గుండే సుందర్‌పాల్, వార్డు సచివాలయం సిబ్బంది తదితరులతో కలిసి ఇంటి పట్టాలు అందజేశారు. పేదల సొంతింటి కల సాకారం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పేరం త్రివేణి రెడ్డి, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీసీసీఐ విజ్జి ట్రోఫీకి చంటి, సుశాంత్‌నాయుడు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: ప్రతిష్టాత్మకమైన బీసీసీఐ విజ్జి క్రికెట్ ట్రోఫీకి విజయవాడ క్రీడాకారులు ఎం.సుశాంత్‌నాయుడు, జి.చంటి ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఇరువురు క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నేపథ్యంలో దక్షణ భారత అంతర విశ్వవిద్యాలయాల నుంచి ఎంపిక చేసిన బీసీసీఐ విజ్జి జట్టులో వీరు చోటు దక్కించుకున్నారు. వీరిద్దరు ప్రస్తుతం విజయవాడలోని నలంద డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. విజ్జి ట్రోఫీకి ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాలలో క్రీడాకారులను మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పాల్గొని క్రీడాకారుల ప్రతిభను కొనియాడారు. తమ కళాశాలలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తామని, క్రీడాకారులకు ఫీజులో రాయితీ ఇస్తామని ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు తెలిపారు. ఈ నెల 10 నుంచి గౌహతిలో జరిగే బీసీసీఐ విజ్జి ట్రోఫీలో క్రీడాకారులు పాల్గొంటారని పీడీ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

మహిళల క్రీడా సాంస్కృతిక పోటీలు ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం ఆధ్వర్యంలో క్రీడా సాంస్కృతిక పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పోటీలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఆడిటోరియంలో క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని ఏపీ జేఏసీ మహిళా విభాగం చైర్ పర్సన్ పారే లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి తెలిపారు. ముగింపు వేడుకల్లో పోటీల్లో గెలుపొందిన మహిళా ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ముగింపు వేడుకలకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర రావు అతిథులుగా హాజరవుతారని చెప్పారు.

దోమల నివారణకు చర్యలు

పాయకాపురం(విజయవాడరూరల్): నగరంలో దోమల నివారణకు నగరపాలక సంస్థ చర్యలు చేపట్టింది. అందులోభాగంగా మంగళవారం 61వ డివిజన్ పాయకాపురంలో మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు ఉద్ధృతం కాకుండా నిర్మూలించేందుకు గాను ఆయిల్ బాల్స్‌ను నీటిలో వదిలామని కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞానపీఠం పీఠం ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం లోక కల్యాణార్థం సామూహిక కుజ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ శివజ్ఞాన పీఠం పీఠాధిపతి శివాచార్య స్వామి కుజ వ్రతం విశిష్టతను భక్తులకు వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వ్రతంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో గొడవర్తి శ్రీనివాస్, గార్లపాటి సుదర్శన్, కొనకళ్ల సత్యప్రసాద్, ఎస్‌వీఎస్ నాగేంద్ర దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను పీఠం ఆర్గనైజర్ పి.శ్యాంప్రసాద్ పర్యవేక్షించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



నాయకులతో చర్చిస్తున్న మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తమ చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా గతంలో నిర్వహించిన పొలిటికల్ పార్టీస్ సమావేశంలో రాజకీయ పార్టీలు ప్రతిపాదించిన అంశాలపై అధికారులు తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని 26 పోలింగ్ కేంద్రాల పేర్లలో నెలకొన్న స్వల్ప సవరణల జాబితా కమిటీ ముందు ఉంచగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ఆమోదాన్ని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి గుండె సుందర్‌పాల్, టీడీపీ నుంచి నవనీతం సాంబశివరావు, సీపీఐ నుంచి వీరభద్రరావు, కాంగ్రెస్ పార్టీ నుంచి అన్సారీ, నగరపాలక సంస్థ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, ఎస్ఈ రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆడిటోరియంలో మెడికల్ క్యాంప్



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ రైల్వే హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే ఆడిటోరియంలో మహిళా ఉద్యోగులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్‌లు డాక్టర్ ఎం.జైదీప్, డాక్టర్ ఎల్.రవికాంత్‌లు మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జైదీప్ మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు తరచూగా రైల్వే హాస్పిటల్‌లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 70 మంది మహిళా ఉద్యోగులకు వైద్య సిబ్బంది కాలేయం, మూత్రపిండం, కొలస్ట్రాల్, బ్లడ్ కౌంట్, షుగర్ లెవల్స్‌తో పాటు ఈసీజీ, ఎకో, జనరల్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సాధికారతను ప్రోత్సహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మహిళా ఉద్యోగులకు 'ఉమెన్ ఇన్ వికసిత్ భారత్ – వికసిత్ రైల్ 2047' అనే అంశంపై వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది, పలు ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్య బృందం పాల్గొన్నారు.